క్లుప్తంగా

రామరాజుతోటలో అన్నసమారాధన



రామరాజు తోటలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం రామరాజు తోటలో వరసిద్ధి వినాయక చవితి మహోత్సవంలో భాగంగా శనివారం అన్న సమారాధన నిర్వహించారు. గణేష్ ఉత్సవ కమిటీ యూత్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వివిధ రకాల వంటకాలతో మహా నివేదన చేసి అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. 5 రోజులపాటు చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, ఆదివారం స్వామివారి నిమజ్జనం కార్యక్రమం జరుగుతోందని గణేష్ ఉత్సవ కమిటీ యూత్ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం



ఉండి సెంటర్‌లో వినాయకుని నిమజ్జనం చేస్తున్న నిర్వహకులు

ఉండి: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వాడవాడలా ఏర్పాటు చేసిన విగ్రహాలకు నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ఉండి సీతారామపేటలో వరసిద్ధి వినాయకునికి ఘనంగా వీడ్కోలు పలికారు. నిర్వహకులు, భక్తులు, యువత పెద్ద ఎత్తున నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో సాగింది. తీన్‌మార్ వాయిద్యాలు, బాణాసంచా కాల్పులతో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉండి సెంటర్‌లో స్వామివారిని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక నిర్వహక సంఘ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయం



కాళ్ళకూరులో భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తున్న వెంకటరామరాజు, తదితరులు

కాళ్ల: శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు పేరిట దాట్ల వెంకటరామరాజు అందిస్తున్న సేవలు అభినందనీయమని మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్ అన్నారు. కాళ్ళ మండలం కాళ్ళకూరు గ్రామంలోని సగ్గర్ల పేటలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద శనివారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటరామరాజు మాట్లాడుతూ కూతురు పేరిట ట్రస్టు ఏర్పాటు చేసి తన సంపాదనలో కొంతభాగం పేద ప్రజలకు సేవలు చేయడం సంతృప్తినిస్తుందన్నారు. అనంతరం సుమారు 3వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గోకరాజు వెంకటశివరామరాజు, వేగేశ్న గోపాలకృష్ణంరాజు, అడ్డాల నాగరాజు, యాతం తేజ, సాధు శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నీరుగారుతోన్న రక్షిత నీటి పథకాలు

- ప్రమాదభరితంగా పలు ట్యాంకులు
- అరకొర నీటి సరఫరా


ఆకివీడు: పేద ప్రజల దాహార్తిని తీర్చే రక్షిత మంచి నీటి పథకాలకు రక్షణ లేకుండా పోయింది. పది, పదిహేనేళ్ల క్రితం నిర్మించిన రక్షిత మంచినీటి పథకాలు బీటలు వారి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఉండి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రక్షిత మంచినీటి పథకాల్లోకి ఫిల్టర్ చేసిన నీటిని నింపి, ఆ నీటిని పైపుల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. గత 20 ఏళ్ల క్రితం నుంచి ఈ విధంగా నీటిని సరఫరా చేస్తున్నారు. పైప్‌లైన్ల ద్వారా ప్రజల ఇంటికి సురక్షిత నీరు అందుతుంది. ఇటీవల కాలంలో ఆయా రక్షిత నీటి పథకాల ట్యాంకులు బీటలువారి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. పలు చోట్ల ఫిల్లర్లు విరిగిపోవడం, పైప్ లైన్లు తుప్పుపట్టిపోవడం జరిగింది. ట్యాంక్ బీటలు వారడంతో నింపిన నీరు ట్యాంక్ గుండా క్రిందికి కారిపోతుంది. దీనివల్ల ట్యాంక్‌కు మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. నియోజకవర్గంలోని 71 గ్రామాల్లో సుమారుగా 185 రక్షిత నీటి పథకాలున్నాయి. వీటి ద్వారానే ప్రజలకు కుళాయి నీరు సరఫరా అవుతోంది. వీటిలో అధిక శాతం పురాతనమైన ట్యాంకులే. రెండు దశాబ్దాల క్రితం నిర్మించన ట్యాంకులు కూడా చాల ప్రాంతాల్లో మరమ్మతులకు గురువుతున్నాయి. నీరుగారుతున్నాయి.

చెరువులకు, బావులకు కాలం చెల్లింది

గతంలో చెరువులు, బావుల ద్వారా నీటిని ప్రజలు తాగడానికి వినియోగించేవారు. వాటి కాలం వెళ్లిపోయింది. కాలం మారినట్లుగా నీటి సరఫరాలో మార్పులు సంభవించాయి. పైప్‌లైన్లు, ఓహెచ్ ఎస్‌ఆర్‌లు రావడంతో చెరువులు, బావులు కలుషితమైపోయాయి. ప్రస్తుతం ఓహెచ్‌ఎస్‌ఆర్ల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉందంటున్నారు. ఇప్పటికే ఆర్వో వాటర్ రావడంతో త్రాగడానికి కుళాయినీరు 50 శాతంకు పైగా జనం వినియోగించడంలేదు. వాడకానికి మాత్రమే వాటిని వినియోగిస్తున్నారు.



మండలంలోని చినమిల్లిపాడు గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఓహెచ్‌ఎస్‌ఆర్



శాంతినగర్‌లో ప్రమాదభరితంగా ఉన్న ఓహెచ్‌ఎస్‌ఆర్



ఓహెచ్‌ఎస్‌ఆర్ పగిలిపోయి నీరుగారుతున్న దృశ్యం

ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు లేకపోతే మళ్లీ చెరువులపైనే ఆధారపడాల్సి వస్తుందంటున్నారు.

గ్రామీణ మంచినీటికి ప్రాధాన్యత ఇవ్వాలి

కేంద్ర,ం, రాష్ట్ర ప్రభుత్వంలు గ్రామీణ మంచినీటి వ్యవస్థ మెరుగుకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ప్రజలు కోరుతున్నారు. నూతన ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల నిర్మాణానికి, పైప్‌లైన్ల విస్తరణ, ఫిల్టర్ బెడ్‌లు, సంప్‌ల నిర్మానానికి నిధులు అధికంగా కేటాయించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.



దొరగారి చెరువు వద్ద ఉన్న ఓహెచ్‌ఎస్‌ఆర్ నుంచి నీరుగారుతున్న దృశ్యం

ప్రమాదభరితంగా శాంతినగర్ ట్యాంక్



స్థానిక శాంతి నగర్ రక్షిత నీటి పథకం ప్రమాదభరితంగా ఉంది. ట్యాంక్‌లోకి నీటిని నింపే సమయంలో నీరు ట్యాంక్ నుండి కారిపోతుంది. పలు చోట్ల బీటులు తీశాయి. ప్రమాద భరితంగా ఉన్న ట్యాంక్‌లోకి పూర్తిగా నీరు నింపకపోవడం వల్ల ప్రజలకు పూర్తి స్థాయిలో నీరందడంలేదు. దీని స్థానే కొత్తది నిర్మించాలి. పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు కొత్తవి నిర్మాణానికి నిధులు కేటాయించాలి.

కే.తవిటి నాయుడు,
సీపీఎం ఏరియా కార్యదర్శి, ఆకివీడు

నేడు ఉచిత వైద్య శిబిరం

భీమవరం: భీమవరం పట్టణం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ప్రారంభిస్తారని ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో న్యూరాలజీ, బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనంతరం గరగపర్రు గ్రామంలోని వసుధ వాత్సల్య నిలయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలకు ఆర్థిక సహాయం అందిస్తారని ఈ కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొంటారని ప్రసాదరాజు తెలిపారు.

స్వామివార్లకు పుష్పాలంకరణలు



భీమవరం (ప్రకాశం చౌక్): గునుపూడిలో శ్రీ విద్యా గణపతి స్వామి వారి ఆలయం గణపతి నవరాత్రి మహోత్సవ భాగంగా పుష్పాలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా దంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంధ సంస్థ పద్మావతీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం జె.పి. రోడ్ భీమవరం నందు భాద్రపద మాసంలో మొదటి శనివారం పురస్కరించుకొని స్వామివారికి ఊంజల సేవ, సహస్రదీపాలంకరణ పూజా కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

డీఎన్నార్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల అలుమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల పూర్వ విద్యార్థి, కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ తనకు డీఎన్నార్‌తో విడదీయరాని అనుబంధం ఉందని కళాశాల విద్యార్థిగా, విద్యార్థి నాయకునిగా, అధ్యాపకునిగా, పాలక వర్గంలో సంయుక్త కార్యదర్శిగా వివిధ హోదాలలో పనిచేసే అవకాశం కలిగిందన్నారు. ఈ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థి జీవితంలో స్థిరపడిన తర్వాత తమ వంతు సహాయ సహకారాలు అందించి విద్యావ్యాప్తికి , ఉపాధిఅకాశాలు కల్పించడానికి సహకరించాలన్నారు. అలుమిని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వీఎస్ రాజు మాట్లాడుతూ విద్యా సంస్థల ప్రగతికి పూర్వ విద్యార్థులు సహాయసహకారాలు అందించాలన్నారు. అనంతరం మంత్రి శ్రీనివాసవర్మను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహారాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, అసోసియేషన్ కార్యదర్శి బొండా రామకృష్ణారావు(రాంబాబు) తదితరులు పాల్గొన్నారు.



డీఎన్నార్ కళాశాలలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి

వీరవాసరం: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో బీవీవీ అప్పారావు తెలిపారు. మండలంలోని పలు గ్రామంలోని శనివారం పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధుల్లో ప్రతిరోజు తప్పనిసరిగా పరిశుభ్రపరుస్తూ బ్లీచింగ్ కొట్టాలన్నారు. ప్రజలంతా పంచాయతీ సిబ్బందికి సహకరిస్తూ, వారి వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్న ప్రస్తుత సమయంలో గ్రామాల్లో పారిశుద్ధ్య సక్రమ నిర్వహణ ద్వారా ప్రజలంతా అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారని వివరించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి నూకల సూర్యనారాయణ ,లక్ష్మణ్, ప్రదీప్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

శ్రీవారి సేవలో లండన్ డిప్యూటీ మేయర్ ఉదయ్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి వారిని శనివారం లండన్ డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదయ్ అరేటి దర్శించుకున్నారు. మందిర అధ్యక్షులు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు శ్రీనివాసచార్యులు అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ మర్యాదలతో ఉదయ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుక్కల బాల, సరిపిడకల రామారావు, జానపాటి మధు సుధన్ రావు, చెరుకువాడ రంగసాయి, కేవీ కృష్ణారావు, కడలి ఫణి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



ఉదయ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

స్థానిక వనరులను వినియోగించుకోవాలి

పాలకొల్లు సెంట్రల్: స్టార్టప్స్ ద్వారా స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని నూతన వ్యవస్థాపకులుగా ఎదగాలని ప్రొఫెసర్ ఎస్ ఉదయభాస్కర్ అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంటర్‌ప్రెన్యూర్ వర్క్‌షాప్ (కార్యశాల)పై జాతీయస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమండ్రి ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎస్.ఉదయభాస్కర్ మాట్లాడుతూ వ్యవస్థాపకుడికి ఉండాల్సిన లక్షణాలు, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా వన్ కామన్ లెసన్ ఆన్ ఇన్నోవేషన్ స్టార్టప్స్ అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, ఐసీఐ ప్రెసిడెంట్ టి.కృష్ణ, కె. భద్రాచలం, ఎం .రామకృష్ణ, డా వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మంచినీళ్లు అడిగితే కేసులా?

- రసాభాసగా కౌన్సిల్ సమావేశం
- ఇద్దర కౌన్సిలర్లపై కేసుతో దద్దరిల్లిన కౌన్సిల్ సమావేశం
- గంటన్నరకు పైగా హోరెత్తిన సమావేశం
- చైర్‌పర్సన్ జామి హైమావతి హామీతో విరమణ

ఆకివీడు: సిగ్గు, సిగ్గు, నిసిగ్గుగా మంచినీళ్లు అడిగితే కేసులా, ఇది ప్రజాస్వామ్యమా, రాచరికమా. ప్రజల ఇబ్బందుల్ని నిరసన రూపంలో తెలిపినందుకు కేసులా? ఇదేం పాలన అంటూ ఆకివీడు నగర పంచాయతీ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ నిరసన వ్యక్తం చేయడంతో సమావేశం గంటన్నర సేపు దద్దరిల్లింది. కౌన్సిలర్లు ప్లకార్డులతోనూ, సమావేశ హాలులో భైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కౌన్సిలర్ క్షమాపణ చెప్పాలని, కేసుల్ని ఉపసంహరించుకోవాలని, మంచినీళ్లు పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని నినాదాలు చేశారు. ఒక దశలో కమిషనర్ కృష్ణమోహన్ కేసుపై వివరణ ఇచ్చేందుకు మైక్‌లో మాట్లాడుతుండగా, కౌన్సిలర్లు పెద్ద ఎత్తున నినాదాలు చేసి సమావేశాన్ని హోరెత్తించారు. కేసు ఫైల్ అయిపోయిందని, నేను చేసేది ఏమీలేదని చెప్పడంతో కౌన్సిలర్లు మండిపడ్డారు. ఇదే తరుణంలో టీడీపీ, జనసేన కౌన్సిలర్లు గతంలో తమ కౌన్సిలర్ భర్తపై ప్రజా సమస్య గురించి అడిగినప్పుడు కమిషనర్ ఇదే విధంగా కేసు పెట్టారని, అప్పుడు ఎందుకు మీరు సహకరించలేదని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, కూటమి కౌన్సిలర్లు సమావేశంలో ఆందోళనకు దిగి బల్లలుగుద్దుతూ కేసు నమోదుపై వ్యతిరేకంగానూ, అనుకూలంగా నినాదాలు చేశారు. సమావేశం నిర్వహించాలని కూటమి కౌన్సిలర్లు పట్టుపట్టనప్పుడు కమిషనర్ కృష్ణ మోహన్ మైక్ తీసుకుని మాట్లాడే ప్రయత్నం చేయగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మైక్‌లో మాటలు విన్పించనివ్వకుండా సమావేశపు హాల్ దద్దరిల్లేలా నినాదాలు చేశారు. అదే సమయంలో ఆకివీడు ఏఎస్ఐ సత్యనారాయణ సమావేశ హాల్‌లోకి రావడంతో కౌన్సిలర్లు మండిపడ్డారు. పోలీసుల్ని ఎందుకు పిలిపించారు, మేము దొంగలమా అంటూ అరుపులు, కేకలతో సమావేశ హాల్ మళ్లీ దద్దరిల్లింది. దీంతో ఏఎస్ఐ సమావేశ హాలు నుంచి బయటకు వచ్చేశారు. గంటన్నర సేపు జరిగిన నిరసన అనంతరం చైర్‌పర్సన్ జామి హైమావతి కేసులో ఉన్న ఇద్దరు కౌన్సిలర్లు గేదల అప్పారావు, పడాల శ్రీనివాసరెడ్డి మాట్లాడి, కమిషనర్ కేసు ఉపసంహరించుకునేందుకు తనకు హామీ ఇచ్చారని, నిరసన విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అప్పారావు, శ్రీనివాసరెడ్డిలతో పాటు వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న న, కౌన్సిలర్లు నిమ్మల నాగు, కట్టారవి, దొడ్డి జగదీష్, మోటుపల్లి కుమారి, తిరుమారెడ్డి మాధవి, అగ్రపున్నీసా, గుండుగొలను సావిత్రి నిరసనను విరమించారు.



సమావేశ హాల్‌లో బైఠాయించి, ప్లకార్డులతో, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆకివీడు నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

చిరు వ్యాపారాల నియంత్రణకు గ్రీన్ సిగ్నల్

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో సుమారు రూ.10 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన శనివారం జరిగిన సాధారణ సమావేశంలో అజెండాకు వచ్చిన అంశాల్ని ఆమోదించారు. చైర్‌పర్సన్ సూచనల మేరకు ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైయిన్లు, పైప్‌లైన్ల విస్తరణ, మరమ్మతులు, వివిధ వార్డుల్లో రోడ్ల మరమ్మతులు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం వంటివాటికి నిధులు కేటాయించారు. రూ. ఐదు లక్షలు చొప్పున ఆయా వార్డుల్లో పనులు చేపట్టనున్నారు. వీటితో పాటు అజెండాలోకి వచ్చిన సోలార్ ఇన్వెర్టర్ ఏర్పాటుకు రూ. 72,689లు, రెండు స్లో స్టాండ్ ఫిల్టర్లు, రీచార్జీలకు రూ. 9 లక్షలు, చెత్త శుద్ధికి రూ. 88,500లు, వివిధ వార్డుల్లో రోడ్ల మరమ్మతులకు రూ. 99 వేలు, పైప్‌లైన్ల వాల్‌లీకేజీ, మరమ్మతులకు రూ. 99 వేలు, మంచినీటి అవసరాల నిమిత్తం జనరేటర్ మరమ్మతులకు, రూమ్ మరమ్మతులు, వైరింగ్‌కు రూ. 99 వేలు, పట్టణంలో వివిధ డ్రైయిన్లలో జేసీబీ ద్వారా పూడిక తీత పనులకు రూ. 99 వేలు కేటాయించగా, పట్టణంలో 135 వీధి కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు చేయించేందుకు ఒకొక్క కుక్కకు రూ. 1500లు చొప్పున మొత్తం రూ. 2,02,500లు చెల్లించేందుకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

చిరువ్యాపారుల నియంత్రణకు ఆమోదం

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పట్టణంలో చిరు వ్యాపారాల్ని నియంత్రించేందుకు కౌన్సిల్ సమావేశం ఆమోందం తెలిపింది. పట్టణాన్ని మూడు జోన్‌లుగా ఏర్పాటు చేసింది. గ్రీన్ జోన్‌లో డైలీమార్కెట్, ఐభీమవరం టర్నింగ్, గుమ్ములూరు సెంటర్‌లలో వీధి విక్రయాలు జరుపుకోవచ్చు. అంబర్‌జోన్‌గా బుధవారం మార్కెట్‌లో రాత్రి 8 గంటల వరకూ, బస్‌స్టాండ్ రోడ్డు, జెడ్పీ బాలుర స్కూల్ రోడ్డు అంబర్‌జోన్‌గా గుర్తించారు. రెడ్ జోన్‌గా ఎన్‌హెచ్–165 రోడ్డు, పోలీస్‌స్టేషన్, ఎస్.టర్నింగ్, మెయిన్ రోడ్డు, గుమ్ములూరు రోడ్డు, తహసీల్దార్, ఫైర్‌స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రిల వద్ద చిరు వ్యాపారాలు చేయకూడదని తీర్మానం చేశారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు , నెగ్గిపూడి, వెలగలేరు గ్రామాల్లో రూ.38 లక్షలతో నిర్మించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. నెగ్గిపూడి పంచాయతీ పరిధిలోని వనంపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, డ్రెయిన్ ప్రారంభించారు. అదేవిధంగా ఓడూరు గ్రామంలో రెండు రైతు సంఘాల గ్రూపులకు సబ్సిడీపై రూ.19.60 లక్షలు విలువైన డ్రోన్లను ఆయన అందజేశారు.

13న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశార. రాజీ చేసుకోదగిన కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవడానికి ఇదో మంచి అవకాశమని వివరించారు. అన్ని రకాలు కేసులు రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారుల్లో అవగాహన కల్పించి లోక్ అదాలత్ విజయవంతమయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు, న్యాయవాదులకు సూచించారు.

మునిపల్లే రాజు సాహిత్యం ఆదర్శనీయం



జాతీయ సదస్సులో ఆవిష్కరణలు చేస్తున్న సలహా మండలి సభ్యులు

పెనుగొండ: మునిపల్లే రాజు కథలు, రచనలు, తరువాత తరం వారికి ఆదర్శనీయమని తెలుగు సాహితీ అకాడమీ సలహా మండలి సభ్యులు మృణాళిని అన్నారు. శనివారం పెనుగొండ ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో కేంద్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగు విభాగం నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. మునిపల్లె కథలను, వారి రచనలను పాఠ్యాంశాలుగా చేర్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఐఏఎస్ అధికారి, తెలుగు రచయిత వాడ్రేవు చిన వీరభద్రుడు మాట్లాడుతూ మునిపల్లే రచనల్లో మానవీయ కోణం, ఆత్మ దర్శనం కనిపిస్తుందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. విద్యార్థి స్థాయి నుంచి పుస్తక పఠనంతో ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, మునిపల్లే రాజు కుమార్తె కె.లక్ష్మీ ప్రసన్న, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు టి.నాగిరెడ్డి, సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి గంగరాజు

నరసాపురం/నరసాపురం రూరల్: బాల్య వివాహాలు పూర్తిస్థాయిలో నిర్మూలించాల్సిన అవసరముందని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు సూచించారు. శనివారం కొప్పర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చిన్నవయస్సులో గర్భం దాల్చితే వచ్చే ప్రమాదాలపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. గతంతో పోలిస్తే బాల్య వివాహాల సంఖ్య తగ్గిందని, అయితే ఇంకా పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. బ్యాల వివాహాలు చేసినా, ప్రోత్సహించినా కూడా జరిమానా, జైలు శిక్ష పడతాయని హెచ్చరించారు. సర్పంచ్ వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఆర్.వరలక్ష్మి, ఎస్.రాజ్యలక్ష్మి, నరసాపురం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వైదాని నాగేశ్వరరావు, ఇంజేటి జాన్ కెనడీ, డాక్టర్ జేరూష తదితరులు పాల్గొన్నారు.